క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వెంకట్రామిరెడ్డి, నాయకులు

టేకుమట్ల : మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేష్ ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి పరామర్శించి, రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్క విజయ్‌గౌడ్, కత్తి సంపత్‌గౌడ్, పెరుమాండ్ల తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీ ఎన్నిక



మల్హర్ : మండలంలోని చిన్నతూండ్లలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రుద్రారపు రామచంద్రం మాదిగ, మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పులిగంటి అవినాష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా పులిగంటి రాజబాపు, ఇందారపు భీమ్, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి సాయి, గౌరవ అధ్యక్షుడిగా నరసయ్య, రాజయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పెద్ద రవి, రామ్‌చరణ్, వెంకటేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన నాయకులు



కాటారం : కాటారం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణను బుధవారం మండలంలోని మాజీ సర్పంచ్ కారెంగుల తిరుపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'దాడి సరికాదు'

రేగొండ : జర్నలిస్టుపై దాడి సరికాదని ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు పట్టెం కోటిలింగం అన్నారు. తాడ్వాయిలో రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా మండల కేంద్రంలో బుధవారం ధర్నా చేపట్టారు. జర్నలిస్టులపై దాడులు నిరోధించేందుకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు.

పాలాభిషేకం



మొగుళ్లపల్లి : రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమకావడం పట్ల బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి మహమ్మద్ రఫీ, తక్కళ్లపల్లి రాజు, బండి సుదర్శన్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, రమేష్, రాము, ప్రసాద్, మహేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యపరీక్షలు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ పంచాయతీ కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో లేబర్ కార్డు కలిగి ఉన్న వారికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరు లేబర్ కార్డు కలిగి ఉండాలని ఆయన సూచించారు.

నిరుద్యోగులకు శిక్షణ

భూపాలపల్లి అర్బన్: ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిఫ్రిజిరేటర్, ఏసీ, వాషింగ్‌మిషన్, వాటర్ ప్యూరీఫయర్, టీవీ, మైక్రోవేవ్ ఓవెన్ రిపేర్, ఇన్‌స్టాలేషన్లపై శిక్షణ ఉంటుందని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఒకేషనల్ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 25 ఏళ్లలోపు నిరుద్యోగులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉచిత శిక్షణతోపాటు భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఏరియాలోని ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

వన మహోత్సవానికి సిద్ధం

- నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

టేకుమట్ల : మానవ మనుగడకు చెట్లను పెంచి, కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించడానికి మొక్కలు నాటే కార్యక్రమమే వన మహోత్సవం. వనమహోత్సవ కార్యక్రమంలో చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ, మొక్కలను పెంచుతున్నారు. వర్షాకాల ప్రారంభంలో పూలు, పండ్లు, ఇతర మొక్కలను నాటేందుకు వేసవిలో విత్తనాలను సమకూర్చుకుని ఉపాధి హామీ పథకంలో నర్సరీ కూలీలను వినియోగించుకుని మొక్కలు పెంచుతున్నారు.

అన్ని గ్రామాల్లో నర్సరీలు..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, ఒక్కో నర్సరీకి వన సేవకుడిని నియమించి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు వీరిని పర్యవేక్షిస్తుంటారు. వర్షాకాలంలో వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ నర్సరీ నుంచి మొక్కలను తీసుకుని గ్రామాల్లోని ఇంటింటికి, ప్రధాన రోడ్ల వెంట, అధికార కార్యాలయాల్లో, పలు చోట్ల మొక్కలను నాటుతారు.

కాలుష్యరహిత పర్యావరణమే లక్ష్యం..

రోజు రోజుకు వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొక్కల పెంపకాన్ని చేపట్టాయి. గాలి కాలుష్యాన్ని నివారించేందుకు చెట్లే ప్రధాన వనరు. ప్రతీ ఒక్కరు కుటుంబ సభ్యుల గుర్తుగా తప్పని సరిగా మొక్కను నాటాలని అధికారులు, పలు ఎన్జీఓలు పని చేస్తున్నాయి. ఇందుకు ప్రతీ వర్షాకాల ప్రారంభంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం విధిగా చేసి, నర్సరీల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రస్తుతం అన్ని మండలాల్లోని నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి.



రామకిష్టాపూర్(వి) నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

మొక్కలు సిద్ధం చేస్తున్నాం..



ప్రతీ ఏటా వర్షాకాల ఆరంభంలో ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేస్తున్నాం. వనమహోత్సవానికి ఆరోగ్యమైన మొక్కలను పంపిణీ చేస్తున్నాం, వాటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ప్రతీ ఇంటికి మొక్కలను పంపిణీ చేయడంతో పాటు, గ్రామంలోని ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. అధికారులు, గ్రామస్తుల సహకారంతో నర్సరీని ప్రతీ సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– గుగులోత్ మౌనిక, జీపీ కార్యదర్శి, రామకిష్టాపూర్(వి)

అటెన్షన్ ప్లీజ్

బుంగ.. బెంగ



ప్రమాదకరంగా ఉన్న బుంగ (గుంత)

మండలంలోని జూకల్ పెట్రోల్ బంక్ నుంచి చల్లగరిగకు వెళ్లే దారిలో రోడ్డుపై ప్రమాదకరంగా బుంగ ఏర్పడింది. దీంతో వాహనదారులు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన బుంగ (గుంత)ను త్వరగా పూడ్చివేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– చిట్యాల

అబ్బాయిగూడెంలోనే 'పీసా' సభ నిర్వహించాలి

వెంకటాపురం(కె) : అబ్బాయిగూడెం గ్రామంలోనే పీసా గ్రామసభ నిర్వహించాలని బుధవారం గ్రామస్తులు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసా చట్టం ప్రకారం అబ్బాయిగూడెం గ్రామంలోనే గ్రామ సభ నిర్వహించాలని కోరారు. మొర్రవాని గూడెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం వల్ల వేరే సొసైటీ సభ్యులు వచ్చి గొడవలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారారులు పీసా గ్రామసభను అబ్బాయిగూడెం గ్రామంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

మొగుళ్లపల్లి : సైబర్ నేరాల నియంత్రణపై మండల కేంద్రంలో రైతులకు ఎస్సై అశోక్ ఆదేశాల మేరకు ఏఎస్సై రాజేశం సిబ్బందితో కలిసి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ ముఖ్యంగా సైబర్ నేరస్తులు ఫేక్ పోలీస్ ఆఫీసర్ అంటూ అమాయకులకు కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. అసలు డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని, ఎవరికైనా ఇలాంటి కాల్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నాం అంటే నమ్మొద్దని తెలిపారు. వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, బ్యాంకు సంబంధిత ఓటీపీలు ఎవరికి చెప్పొద్దని తెలిపారు. ముఖ్యంగా రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలకు సంబంధించిన సోషల్ మీడియాలో వచ్చే ఏపీకే యాప్స్ ఇన్‌స్టాల్ చేయొద్దని , ఇందిరమ్మ ఇల్లు వచ్చిందంటూ వచ్చే అపరిచిత కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

చిట్యాల : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై ఎస్సై–2 ఈశ్వరయ్య బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు కావద్దని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. మత్తు పదార్థాలకు ఎవరు బానిస కాకుడదని అన్నారు. ఎవరైనా అలాంటి డ్రగ్స్ వాడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు యాంటీ నార్కొటిక్ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 1908పై వివరించారు.హెడ్ కానిస్టేబుల్ చంద్రమౌళి, పోలీసులు లాల్‌సింగ్, రంజిత్, క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎంఈఓ కుమారస్వామి

మొగుళ్లపల్లి : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని 9, 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల అనారోగ్యం బారిన పడటమే కాకుండా కుటుంబాలు సైతం రోడ్డున పడుతాయన్నారు. అనంతరం పోటీల్లో మొదటి స్థానం పొందిన మొట్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన భీమనాథుని సాయిచరణ్, రెండో బహుమతి పొందిన మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన మహమ్మద్ ఖాజపాషాకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, భాగ్యశ్రీ, పద్మ, రవీందర్, కొమురెల్లి, ఎంఆర్సీ సిబ్బంది వేణు, శ్రీనివాస్, శివకుమార్, చంద్రమౌళి, రమేష్‌తో పాటు తదితరులుపాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ కుమారస్వామి, ఉపాధ్యాయులు

వ్యాసరచన పోటీలు

కాళేశ్వరం : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మహాదేవపూర్‌లో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మండల విద్యాధికారి ప్రకాశ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు బి.రాజిరెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

అటవీ భూముల పరిశీలన

మల్హర్: మండలంలోని తాడిచర్ల, కాపురం పరిధిలోని అటవీ భూములు కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుకు జెన్‌కో సంస్థకు అటవీశాఖ కేటాయించిన ఫారెస్ట్ భూమి వివరాలను సిబ్బందిని అడిగి తెలుకోని, మ్యాప్‌ను పరిశీలించారు. కాపురం శివారులో కంపార్ట్ నంబర్ 432లో 38 హెక్టార్ల అటవీ భూమిని కేటాయించినట్లు కొయ్యూరు రేంజర్ రాజేశ్వర్‌రావు సీసీఎఫ్‌కు వివరించారు. అటవీ శాఖకు జెన్‌కో సంస్థ 38 హెక్టార్ల భూమి కేటాయించడంతోపాటు చెట్లకు సైతం పరిహారం అందించినట్లు చెప్పారు. అనంతరం ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. అడవుల సంరక్షణకు సిబ్బంది పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ నవీన్‌రెడ్డి, ఎఫ్‌డీఓ అప్పల కొండయ్య, తాడిచర్ల సెక్షన్ అధికారి లక్ష్మణ్, ఏఎమ్మార్ అధికారులు పాల్గొన్నారు.



ఫారెస్ట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ఓ

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గోవిందరావుపేట : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పస్రా ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దుంపెల్లిగూడెంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు సహకరించిన దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సామ శ్రీనివాస్, భూక్య రాజు, యాకాంబ్రం, అభిలాస అఫ్జల్, రవికిషోర్, ఐలయ్య, జనార్దన్, రమేష్, అశోక్, రాజేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచినందుకా సంబురాలు?

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి : రాష్ట్రంలోని రైతులను ముంచినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకుంటుందా అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక దఫా రైతుబంధును ఎగ్గొట్టి, మరోసారి 4 ఎకరాల వరకే ఇచ్చి, ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15 వేలు ఇవ్వకుండా రూ.12వేలు ఇస్తోందని విమర్శించారు. రైతు చనిపోతే, బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్ రైతు భరోసా పథకాన్ని తీసుకొస్తే, కాంగ్రెస్ సర్కారు దాని ప్రీమియం కట్టలేని దీనస్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఒక్కటి కూడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్న స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు భయపడుతూ వాయిదా వేస్తూ వస్తోందన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, నాయకులు నూనె రాజు, సెగ్గెం సిద్ధు, హరీష్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు

సంబురాలు అవివేకం

టేకుమట్ల : కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు భరోసా సంబురాలు చేసుకోవడం అవివేకమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదని, సంబురాలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పేద విద్యార్థికి చేయూత

గోవిందరావుపేట : పదో తరగతి ఫలితాల్లో పస్రా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థిని బెజ్జరబోయిన శ్రవంతి ఉత్తమ మార్కులు సాధించింది. కాగా అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పొన్నం లవకుమార్ ఆమెకు చేయూతనందించారు. బుధవారం విద్యార్థికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్, గురువు కళ్యాణపు రమేష్ రూ.10 వేలు నగదు అందజేశారు. రమేష్ మాట్లాడుతూ లవకుమార్ ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తూ నిరుపేద విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని అన్నారు.

బుక్స్, వాటర్ బాటిళ్ల పంపిణీ



ములుగు రూరల్ : ములుగు పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీకే పుస్తకాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడువైపు పోకుండా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

'సమస్యలు పరిష్కరిస్తాం'

ఏటూరునాగారం : పాఠశాల అభివృద్ధికి దోహదపడుతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. బుధవారం మండలంలోని నార్త్ పాఠశాలను నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మల్హర్ /కాటారం: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎడ్లపల్లి పంచాయతీ పరిధిలోని శుభాష్‌నగర్‌లో బుధవారం జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన పిల్లమారి ఆనంద్ తన ఎద్దును మేతకు వదిలాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో కాటారం మండలం రేగులగూడెం ట్రాన్స్‌ఫార్మర్ గద్దెకు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు ఆనంద్ వేడుకుంటున్నాడు.



మృతి చెందిన ఎద్దు వద్ద ఆనంద్

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు.. ఎమర్జెన్సీ

- మాజీ మంత్రి విజయరామారావు

రేగొండ : ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ డే (జూన్ 25) చీకటి రోజు అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గుండె విజయ రామా రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి విజయరామ రావు, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి హాజరై ఎమర్జెన్సీ కాలం నాటి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1975–77 మధ్య కాలంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఏకపక్షంగా 21 నెలల పాటు దేశంలో అత్యవసర పరిస్థితి విధించారని గుర్తు చేశారు. దేశంలో అంతర్గత అస్థిరతను, అశాంతిని కారణంగా చూపుతూ జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కారన్నారు. అనంతరం ఎమర్జెన్సీ కాలంలో జైలుకు పోయిన వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాగపూరి రాజమౌళి గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ప్రసాద్ రావు, నాయకులు రవీందర్‌రెడ్డి, తిరుపతి రావు, గాలిఫ్, విష్ణు, కిరణ్, మల్లేష్, వేణు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి విజయరామా రావు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



రోడ్డు భద్రతా నియమాలు పాటించిన వాహనదారులను సన్మానిస్తున్న డీఎస్పీ రవీందర్

- డీఎస్పీ రవీందర్

ములుగు రూరల్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ రవీందర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తున్న వారిని అభినందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు. జరిమానాల కోసం కాదు..మీ ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో సీఐ సురేష్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.